క్లుప్తంగా

గోపూజలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



మండవల్లి: కానుకొల్లులో జరుగుతున్న వసంత సంబరాల్లో భాగంగా జరిగిన గోపూజ, వివిధ జాతుల గోవుల ప్రదర్శనలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ (జేవీఆర్) శనివారం పాల్గొన్నారు. గో ఆధారితంతో పండించిన కూరగాయలు, ధాన్యాలను, స్టాల్స్, రంగవల్లులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగదాసి థామస్, ఎంపీటీసీ సభ్యురాలు పుట్టి మీనాకుమారి, మాజీ సర్పంచ్ పుట్టి సత్యనారాయణ, కుందేటి నాగేశ్వరరావు, విష్ణుమూర్తు శ్రీను, ఆర్.శ్రీను, బొమ్మరిల్లు ఏసు తదితరులు పాల్గొన్నారు.

బల్లిపర్రులో ఉచిత కంటి వైద్యశిబిరం



బల్లిపర్రు(పామర్రు): బల్లిపర్రులో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. కంటి వైద్య నిపుణులు కోలా విజయ్‌శేఖర్ కంటి పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి పైగా పరీక్షలు చేయించారు. వైద్యులు మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో కంటి పరీక్షలు చేస్తున్నామన్నారు. శిబిరంలో 15 మందికి కళ్ల సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ముగ్గురికి కంటి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వీరికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఇంకా 20 మందికి కళ్లజోళ్లు అవసరమని వీరికి త్వరలో అందజేస్తామని చెప్పారు.

నాణ్యతా ప్రమాణాలతో 'ఉపాధి'

పామర్రు: ఉపాధి పనులు నాణ్యతా ప్రమాణాలతో జరగడానికి చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పొలురాజు అన్నారు. పామర్రు టౌన్‌లో నిర్వహిస్తున్న పంట బోదె పూడికతీత పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో కూలీలకు తాగునీటికి, నీడ ఏర్పాటుకు నగదు చెల్లిస్తున్నామన్నారు. 25 గ్రామ పంచాయతీల్లో 2,400 మంది ఉపాధి కూలీలు పంట బోదె పూడికతీత పనుల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షం నీరు



పామర్రు: గ్రామంలో శనివారం కురిసిన వర్షాలకు పలురోడ్లు జలమయమయ్యాయి. అరండల్‌పేట, బాపూజీపేట, గఫార్‌సెంటర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వాన నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి అడ్డంకులు తొలగించడంతో కరెంట్ సరఫరా పునరుద్ధరణ జరిగింది.

క్రీడలతో మానసికోల్లాసం

ముదినేపల్లి రూరల్: యువతలో మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో డీఎన్నార్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాపోటీలు స్నేహపూర్వకంగా సామరస్యంగా నిర్వహించుకోవాలన్నారు. ఆయన కొద్దిసేపు బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మంచాలు, ఫ్యాన్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయం ఆచార్యులు మత్తి నిర్మలానంద ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త బీజేఎస్ కుమార్ శనివారం స్థానిక ఈడేపల్లిలోని జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, వికలాంగులకు మంచాలు, ఫ్యాన్లు, కూజాలు, గ్లూకోజ్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. పాస్టర్ ఇజ్రాయేల్, ఆశ్రమ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్



ప్రజా మద్దతు పుస్తకాలను చూపుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ తదితరులు

కైకలూరు: గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణలో కైకలూరు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని, జగనన్నే మా భవిష్యత్తులోనూ మొదటి ఐదు స్థానాల్లో చోటు దక్కిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాష్ట్రంలో 1.55 కోటి కుటుంబాలకు చేరడం, అదే విధంగా 1.10 కోటి మిస్డ్ కాల్స్ రావడంపై ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన శనివారం కైకలూరు సీతారామఫంక్షన్ హాల్లో విజయోత్సవ సభ జరిగింది. ముందుగా కేక్ కోసి సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా నియోజకవర్గంలో 79 సచివాలయాల పరిధిలోని 88వేల కుటుంబాలకు 83 వేల కుటుంబాలను సందర్శించామన్నారు. నియోజకవర్గం నుంచి 75వేల మిస్డ్ కాల్స్ టోల్‌ఫ్రీ నంబర్‌కు వెళ్లాయన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు, మండవల్లి మండలాల్లో జీఓ 120లో సూచించినది కాకుండా అదనంగా 7,500 ఎకరాలను అధికారులు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌కు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అసెంబ్లీలో అర్డినెన్సు తీసుకువచ్చి పేద ప్రజలకు పట్టాలు అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో విభేదాలు ఉన్నాయని విష ప్రచారం చేస్తున్నారని, ఇద్దరం పార్టీ అభివృద్ధిక కృషి చేస్తున్నామని చెప్పారు. అసత్య వార్తలు ప్రసారం చేస్తే పరువునష్టం కేసు వేస్తానని హెచ్చరించారు. ఎంపీపీలు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు విజయనిర్మల, సత్యవతి, రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీదేవి, సంధ్య, కైకలూరు, కలిదిండి ఏఎంసీల చైర్మన్లు పుష్పలత, బ్రహ్మాజీరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు శివాజీ, రమేష్, వెంకటేశ్వరరావు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ విజయవంతం

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రభుత్వం నుంచి అందిన పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. శనివారం స్థానిక 3వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అనూహ్య స్పందన వస్తోందని తెలిపారు. గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయం మరువలేనిదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం, జగనన్న కాలనీల ఏర్పాటుకు నిధులు కేటాయించడంలో ఆయన చూపిన చొరవ గొప్పదన్నారు. మే 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడకు విచ్చేస్తున్నారని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తారన్నారు. అనంతరం నియోజకవర్గంలో రూ.330 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేస్తారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాలను వివరిస్తున్నామని ప్రతి ఇంటిలో కనీసం ఒక వ్యక్తి ఈ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందిన వారు ఉండటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, పాలడుగు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన పాలనే లక్ష్యం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జగనన్నే మా భవిష్యత్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. జగనన్నే మా భవిష్యత్ మెగా సర్వే లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలు పాల్గొనగా జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా 1.1కోట్లకు పైగా మిస్‌కాల్ వచ్చాయని చెప్పడానికి గర్విస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ క్యాడర్, నిబద్ధత, పట్టుదలతో పని చేసి ఈ సర్వేని పారదర్శకంగా నిర్వహించిందని, అతిపెద్ద పబ్లిక్ సర్వేగా ఇది నిలిచిపోతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన మద్దతుకు రుజువుగా పూర్తైన పుస్తకాలను ఇక్కడ ప్రదర్శించామని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గ్రామాభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో జగనన్న ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లు ముప్పిడి సురేష్‌రెడ్డి, నడకుదురు రాజేంద్ర, జాజుల చిన్నారి, పరసా జగన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. నువ్వే మా భవిష్యత్ జగనన్న కార్యక్రమం మండలంలో విజయవంతమైన సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడలో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కార్మికులకు అండగా జగనన్న ప్రభుత్వం

కైకలూరు: కార్మికులకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కల్యాణ మండపంలో శనివారం కైకలూరు నియోజకవర్గ సౌండ్, లైటింగ్, షామియానా డెకరేషన్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ సభ జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ సంఘం కోరినట్లు సమావేశాలు జరుపుకోవడానికి స్థలం కేటాయింపు పరిశీలనలో ఉందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పనిచేస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బొప్పన శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ కాపవరపు దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ కురెళ్ల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ కుంచె వెంకటేశ్వరరావు, కోశాధికారి బొమ్మనబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్యకా పరమేశ్వరి జయంతి

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం వాసవీమాత జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'గౌతమ్' పూర్వ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల యాజమాన్యం శనివారం ఒక ప్రటనలో తెలిపింది. 1 నుంచి 10 లోపు 3 ర్యాంకులు, వంద లోపు 18 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. డి ఫణీంద్రనాథ్‌రెడ్డి 5వ ర్యాంకు, ఆర్.గ్రేస్ ఏంజల్ బాయ్ 5వ ర్యాంక్, ఎం.అవినాష్ కుమార్ 10వ ర్యాంక్ సాధించారని వివరించారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ టౌన్: స్థానిక బీకేఆర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో స్కిల్ హబ్ ఇనీషియేటివ్, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎంకేవీవై స్కీమ్‌లో స్వల్పకాలిక శిక్షణ తరగతులకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిధర్మేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారికి అసిస్టెంట్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనింగ్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్ల కోర్సులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో మే 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 08674-295253, 8555952320లో సంప్రదించాలని కోరారు.

సమాజసేవలో యువత పాత్ర కీలకం

పామర్రు: సమాజ సేవలో యువత పాత్ర కీలకమని పామర్రు మండల క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో శనివారం సమాజ సేవలో కీలక పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువతకు నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో సత్తా చాటిన వారికి బహుమతులనుఅందించామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ సభ్యులు పీటర్ సాల్మన్, శాలెంరాజు, ఎం.చంటిబాబు, ఎస్.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, వేదికపై ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆకాంక్షించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో రూ.1.45 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన తరగతి గదులను శనివారం ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతో రాణించవచ్చనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. మహానేత వైఎస్సార్ దారిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ అమ్మఒడి, వసతి దీవెనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడానికి రూ.వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న ప్రోత్సాహకాలు వినియోగించుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను రోజూ బడికి పంపాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పరల సునీత, రాచూరి రాధ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యులు మరీదు నాగయ్య, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, ముత్యాల రాంబాబు, షేక్ అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి

కైకలూరు (కలిదిండి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కలిదిండి శశి హైస్కూల్‌లో శనివారం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అమ్మ ఒడి పథకాన్ని అందిస్తోన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ సభ్యురాలు కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ అంశాలపై పేర్ని నాని, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో శనివారం చర్చించారు. రోడ్డు, రైలు మార్గాలకు సంబంధించి రెండో దశ భూ సేకరణ చేయాల్సిన ప్రాంతాలు, భూములు, రైతుల వివరాలు తెలుసుకుని ఎవరికి ఎంత విస్తీర్ణం భూమి ఉందో దానిని బట్టి భూసేకరణ చేయాలని చర్చించారు. అలాగే ఇప్పటివరకు చేసిన భూ సేకరణలో కోర్టు సమస్యలపై కూడా వీరు ఇరువురు చర్చించారు. సమావేశంలో బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ పాల్గొన్నారు.

పరస్పర కేసులు నమోదు

కైకలూరు: అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదంపై వదర్లపాడులో రెండు వర్గాల మధ్య పరస్పర కేసులు రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి వెళ్లే రహదారిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా కట్టిన ఫ్లెక్సీని శుక్రవారం గ్రామంలో చించివేశారని గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. దీనిపై జాడ సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి గ్రామానికి చెందిన గండాబత్తుల నగేష్, అజయ్‌తో పాటు మరో 8 మంది ఫ్లెక్సీ విషయంపై అడిగితే తమను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో మొత్తం 10 మందిపై ఎస్ఐ గాయత్రీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అదే విధంగా గుండాబత్తుల నగేష్ రాత్రి ఇంటికి వస్తుండగా చాగంటి నాని.ఐ మరో ముగ్గురు రాయితో దాడి చేశారని ఫిర్యాదుపై కౌంటర్ కేసు నమోదైంది.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు

రామానగరం (చల్లపల్లి): విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందిన యువకుని కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.5 లక్షలు మంజూరు చేసింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం బీసీ కాలనీలో గతేడాది డిసెంబర్ 10వ తేదీన తుపాను సమయంలో యువకుడు కోమటి హరీష్ వర్షంలో ద్విచక్ర వాహనంపై పశువుల చావిడి వద్దకు వెళుతుండగా విద్యుత్ వైర్ తెగి హరీష్‌పై పడింది. విద్యుదాఘాతంతో హరీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఏపీసీపీడీసీఎల్ ద్వారా మంజూరైన రూ.5 లక్షలకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుని తల్లి కోమటి వెంకటేశ్వరమ్మకు శనివారం అందజేశారు. విద్యుత్ శాఖ ఏఈ అరవింద్, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్, నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆపరేషన్‌కు రూ.4 లక్షల మంజూరు

అవనిగడ్డ: పెదప్రోలు శివారు కప్తానుపాలెంకు చెందిన మట్టా కమలాకరరావుకు కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల ఆర్థిక సహాయ పత్రాలను బాధితుడికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుడు మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే తనకు కిడ్నీ సమస్య తలెత్తగా పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆపరేషన్ కోసం రూ.4 లక్షలు మంజూరు చేయించడం జీవితంలో మర్చిపోలేనని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సచివాలయ నియోజకవర్గ కనీ్వనర్ మద్ది చిన్నారి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంటుమిల్లి మండలం మణిమేశ్వరానికి చెందిన కటారి విశ్వేశ్వర కుమార్ వివిధ సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం మంగినపూడి బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన మెరైన్ పోలీసులు ఆయనను కాపాడి ఒడ్డుకు చేర్చారు. మెరైన్ హెడ్ కానిస్టేబుల్ జి. భరతరాజు, హోం గార్డు పి. స్వామి, తాలూకా అవుట్ పోస్ట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, అబ్దుల్ రహీంలను మెరైన్ సీఐ ఎం. శ్యామ్‌కుమార్, ఎస్ఐ చంద్రబోస్, తాలూకా ఎస్ఐ చాణక్య అభినందించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న అధ్యక్షులు కృష్ణారెడ్డి, మేనేజర్ గోపీనాథ్

పామర్రు: స్థానిక పాల సేకరణ కేంద్రంలోని పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ చేశామని సంఘ అధ్యక్షులు, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పాల సేకరణ కేంద్రంలో శనివారం జరిగిన బోనస్ పంపిణీలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నాలుగు నెలల కాలానికి రూపాయికి..15పైసలు చొప్పున బోనస్ ఇచ్చామన్నారు. కేంద్రం పరిధిలో 295 మంది సభ్యులకు రూ.8,04,420 బోనస్‌గా అందించామని చెప్పారు. పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణగోపీనాథ్ సభ్యులకు బోనస్ అందజేశారన్నారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ కైల రమేష్‌బాబు, సంఘ వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి, సంఘ డైరెక్టర్లు, సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు



మొవ్వలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మొవ్వ: నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షను శనివారం మొవ్వలోని మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి. మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల నుంచి 107 మంది పరీక్షకు ధరఖాస్తు చేసుకోగా 11 మంది గైర్హాజరయ్యారని, 96 మంది పరీక్ష రాసినట్లు చీఫ్ ఎగ్జామినర్ జొన్నలగడ్డ కవిత తెలిపారు. ఈ పరీక్షలకు అబ్జర్వర్‌గా సంపత్ కుమార్ నవోదయ పాఠశాల నుంచి రాగ, సీహెచ్‌వీ సురేష్ బాబు పీఎల్ఓగా వ్యవహరించారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీ చించినవారిపై చర్యలు తీసుకోండి

కైకలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు డిమాండ్ చేశారు. వదర్లపాడులో శుక్రవారం జరిగిన ఫ్లెక్సీ వివాదంపై శనివారం ఘటనా స్థలం వద్ద ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ చిత్రాలపై అనుచితంగా ప్రవర్తిస్తే ఊరుకోబోమన్నారు. దీనిపై స్థానిక సీఐ, ఎస్ఐలతో మాట్లాడితే పదిమంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారన్నారు. డీఎస్పీ పర్యవేక్షణలో విచారణ జరుగుతుందని ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చినట్లు పుష్పరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, నాయకులు చిగురుపాటి రాజేష్, జొన్నల వజ్రం, తోర్లపాటి భాగ్యరాజ్, దాసరి చిరంజీవి, మద్ద శాంతారావు, విజయ్, రాఘవ, జాన్‌బాబు పాల్గొన్నారు.

గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామివార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ ఉదయం గోకర్ణేశ్వరుడిని పెండికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజారోహణ జరిగింది. గోకర్ణేశ్వరుడి లింగాకారుడికి పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆదివారం ప్రత్యేక హోమాలు, రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, మే ఒకటో తేదీ రాత్రి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ సుధాకరరావు తెలిపారు. 2న మహా అన్నసమారాధన, రాత్రికి రథోత్సవం, 3న అవధృదస్నానం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. కల్యాణం రోజు ఆలయం వద్ద పంచరత్నాల నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు.

ఉత్సాహంగా జాగృతి స్కూల్ వార్షికోత్సవం

కైకలూరు: స్థానిక జాగృతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం ఉత్సాహంగా శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, పి.వినయ్‌కుమార్, తలారి జాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు రూ.50 వేల విరాళం



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధనకు శనివారం ఓ భక్తురాలు రూ.50,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన బోను నాగమణి ఆమె తల్లిదండ్రులు మర్రపు వెంకటేశ్వరరావు-సరోజినీదేవి దంపతుల జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేశారని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. వేసవి సెలవులు వస్తున్నందున ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని విద్యాశాఖ ఆదేశించింది. అనేక పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్డులు అందజేశారు. వడాలి జెడ్పీహైస్కూల్లో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోగ్రెస్ కార్డుల ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు.